రంగుపడుద్ది.. జాగ్రత్త

- ఆకర్షణీయమైన రంగు కోసం మామిడి పండ్లపై రసాయనాల పిచికారీ
- ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- మెట్టలో 6 వేల హెక్టార్లలో సాగు



తేటగుంటవద్ద హైవే పక్కన పందిళ్లు తొలగించిన మామిడి పండ్లను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

తుని రూరల్: వేసవిలో లభించే మామిడి పండ్లు అంటే ప్రతిఒక్కరికీ ఎంతో ఇష్టం. అంతటి ప్రీతికరమైన మామిడి పండ్లు సాధారణంగా మే నెల నుంచి అందుబాటులో ఉంటాయి. అధిక లాభాలు పొందాలని కొంతమంది స్వార్థపరులు కృత్రిమంగా మగ్గబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు ప్రమాదకరమైన రసాయనాలు వెదజల్లడంతో పక్వానికి రాకముందే ఆకర్షణీయమైన రంగుతో మామిడి ప్రియులకు నోరూరిస్తున్నాయి. ఇలా తుని మండలం చేపూరు నుంచి తొండంగి మండలం సీతయ్యపేట వరకు జాతీయ రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విరివిగా మామిడి పండ్లు అమ్ముతున్నారు. సీజన్ ప్రారంభం కావడంతో ప్రజలు మామిడి పండ్లను అధిక ధరలకు కొనుగోలు చేసి తింటున్నారు. రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలంలో ప్రమాదకర క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నిషేధిత రసాయనాలతో...

పక్వానికి వచ్చిన మామిడి కాయలను కోసి ఎండిగడ్డిలో మాగబెడితే నాలుగైదు రోజులకు పండ్లగా మారడం సాధారణం. ఇలా చేయడం వల్ల ఆశించిన స్థాయిలో మామిడి పండ్లు రంగు ఉండవు. మంచి రుచి ఉండడమే కాకుండా ఆరోగ్యకరంగా ఉంటాయి. కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాన్ని పిచికారీ చేయడం వల్ల పక్వానికి రాని మామిడి కాయలకు సైతం ఆకర్షణీయమైన రంగు వస్తుంది. చూసేందుకు ఆకర్షణీయంగా ఉండడంతో మామిడి ప్రియులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు.



తేటగుంటలో మామిడి సాగు



తుని మండలం చేపూరు వద్ద హైవే పక్కన విక్రయిస్తున్న మామిడి పండ్లు

ఇలా ఆకర్షణీయంగా ఉండే మామిడి పండ్లను వ్యాపారులు రకాలను బట్టి డజను రూ.300 నుంచి రూ.1200 వరకూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రసాయనాలు పిచికారీ చేసిన మామిడి పండ్లను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకువెళ్లి తింటున్నారు. సరైన రుచిలేకపోవడం, పెదవులు, నాలుక మొద్దుబారడంతో రసాయనాలు పూసిన మామిడిగా గుర్తిస్తున్నారు. అప్పటికే అంతర్గతంగా నష్టం జరిగిపోతుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, వినియోగదారులు ఫిర్యాదులు చేయకపోవడంతో స్వార్థపరులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

11 మండలాల్లో...

మెట్ట ప్రాంతంలో ఉన్న 11 మండలాల్లో 6 వేల హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం 50 శాతం తోటలు కాపు కాశాయి. హెక్టారుకు మూడు మెట్రిక్ టన్నుల చొప్పున 18 వేల టన్నుల వరకు దిగుబడి లభిస్తుందని అధికారులు అంచన వేస్తున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణతో పాటు మనరాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, కాకినాడ, తణుకు తదితర మార్కెట్లలో టన్ను ధర ఈవిధంగా ఉంది. బంగినపల్లి రూ.60 వేలు, తోతాపూరి రూ.15 వేలు, సువర్ణరేఖ రూ.55 వేలు, పణుకులు రకం రూ.50 వేల ధర పలుకుతోంది.

పండ్ల తయారీకి రైపెనింగ్ విధానం ఉత్తమం



పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోయాలి. పండ్ల తయారీకి రైపెనింగ్ విధానం ఉత్తమం. రైపెనింగ్ కేంద్రాలు అందుబాటులో లేని రైతులు ఇథిలిన్ వాయువు, ఎండుగడ్డితో మామిడి కాయలను మాగబెట్టుకోవడం ఆరోగ్యకరం. నిమ్మకాయ పరిమాణంలో మామిడి పిందెలు ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు వాడడం వల్ల రంగు, రుచి బాగుంటాయి. మామిడి కాయలు కోయడంలో మెళకువలు పాటించాలి.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

క్లుప్తంగా

పక్షుల కోసం మట్టి పాత్రల వితరణ



తునిలో వ్యాపారులకు మట్టి పాత్రలను అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని: రోటరీ సంస్థ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ జయంతి సందర్భంగా శనివారం పక్షుల కోసం మట్టి పాత్రలను అందజేసినట్టు తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ తెలిపారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తుని మార్కెట్‌లో 1000 మందికి పక్షుల కోసం మట్టి పాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలు తమకు ఉన్న అవకాశాన్ని బట్టి వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు మట్టి ప్రాత్రల్లో నీరు పోసి ఉంచాలని వర్మ కోరారు. దీనిని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మూగ జీవుల కోసం రోటరీ క్లబ్ చేస్తోన్న చిరు ప్రయత్నానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రోటరీక్లబ్ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి, సీహెచ్ మంగరాజు, సాయిబాబా, సూరిబాబు, నాగభూషణం, రామచంద్రారావు, పొన్నాడ శ్రీనివాస్, గౌరీ శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ పరిధిలోని నరసయ్యపేట రామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో పంచమ సప్తాహ మహోత్సవం ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శిగా ఏసు



చంద్రన్న నాయకత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

జగ్గంపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ (చిట్టిబాటి వర్గం) జిల్లా కార్యదర్శిగా జగ్గంపేటకు చెందిన మరుకుర్తి ఏసు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జగ్గంపేటలో శనివారం న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. గుబ్బల ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏడు జిల్లాల నుంచి ముఖ్యనేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ నూతన జిల్లా కార్యదర్శిని ఎన్నుకున్నారు. చంద్రన్న నాయకత్వంలో ఉన్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో పనిచేయమని, వాళ్ల నాయకత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి చిట్టిబాటి వెంకటేశ్వర్లు నాయకత్వంలో పనిచేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



తునిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

తుని: స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో వారంరోజుల పాటు విజయవంతంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించినట్టు తుని అగ్నిమాపక అధికారి రాముడు తెలిపారు. తుని అగ్నిమాపక కార్యాలయంలో శనివారం వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. అగ్నిమాపక పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేసవిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,57,388 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు, మజ్జిగ చలివేంద్రాన్నీ ఏర్పాటు చేసినట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో శనివారం పెన్షనర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెన్షనర్లతో పాటు అన్నివర్గాలకూ మేలు చేసారన్నారు. ప్రభుత్వోగ్యులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పెన్షనర్లు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల సుభాష్‌చంద్రబోస్, శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, పైల విజయ్‌కుమార్, పెన్షనర్లు పాల్గొన్నారు.



పెన్షనర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



తూర్పులక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- తూర్పులక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు తదితర పథకాలతో మహిళలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం



రామచంద్రపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- రామచంద్రపురంలో ఎన్నికల ప్రచారం

కిర్లంపూడి: బడుగు, బలహీన వర్గాల ప్రజల దీవెనలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగించిన జగనన్నకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు ప్రసాద్, ఆరిశ సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, దోని లక్ష్మణరావు, రేపల్లె వెంకటలక్ష్మి, పెంటపల్లి వీరబాబు, ఓలేటి రాజు, తోట అయ్యన్న, తోట సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ గావు సంబరం



గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో గంగాలమ్మతల్లి గావు సంబరం శనివారం వైభవంగా జరిగింది. గంగాలమ్మతల్లి తమ ఇలవేల్పు కావడంతో సారిపల్లి వారి కుటుంబీకులు ప్రతి మూడేళ్లకు ఒక్కసారి ఈ గావు సంబరాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరానికి జిల్లా నలుమూలల నుంచి సారిపల్లి వారి ఆడపడుచులు, కుటుంబీకులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగుపాలెం– నర్సీపట్నం రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని (65) ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి ఎరుపు, నలుపు రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని, ఇతర వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



శంఖవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది బుగతా శివ

శంఖవరం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయవాది బుగతా శివ సూచించారు. స్థానిక కేజీబీవీ విద్యార్థులకు శనివారం న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన పెంచుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలా మణికుమారి, న్యాయవాది ఆకాశపు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: తాళ్లూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రెండు నామినేషన్ల దాఖలు

జగ్గంపేట: సార్వత్రికల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. జగ్గంపేట అసెంబ్లీ స్థానానికి శనివారం రెండు నామినేషన్లు దాఖలైనట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బలిరెడ్డి సోలమన్‌రాజు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సాదే నరేంద్రబాబు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

సీపీఐ(ఎంఎల్) అభ్యర్థిగా శివ నామినేషన్

తుని: తుని అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ తరఫున వాడబోయిన శివ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని 10 మంది బలపరచగా ఈఆర్వో కార్యాలయంలో ఆయన నామినేషన్ వేశారు. ఇప్పటివరకూ రెండు నామినేషన్లు మాత్రమే వచ్చాయని తుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని సూచించారు. పలువురు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న ఎమ్మార్పీఎస్ జిల్లాస్థాయి సమావేశం

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో ఈ 29న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఎస్ఎస్ఎస్సీ జిల్లాస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. గండేపల్లిలో శనివారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. జెడ్.రాగంపేటలో 29న జరిగే సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఎమ్మార్పీస్ ఉత్తరకోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు సింగ్ సుబ్బారావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

- కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి రాజా

తుని: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తుని మండలం వల్లూరుకు చెందిన 100 మంది శనివారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గాది వరహాలబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీకి పట్టుఉన్న పంచాయితీ నుంచి మేడసాని రాఘవ, చోడిశెట్టి తాతీలు, దొర, కొత్తూరు శివ, మహేష్, దాసరి స్వామి, గాది బుజ్జి, గోపాలరావు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వరహాలబాబు మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పని చేసినా గుర్తింపు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి రాజా నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా విజయం కోసం సైనికుల్లా పని చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని మంత్రి రాజా అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తుని మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

గండేపల్లి: ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఎన్నికల అబ్జర్వర్ ఆసీఫ్ సూచించారు. మండలంలోని మురారి వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఎస్ఎస్‌టీ టీం ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రంగం ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అభ్యర్థుల ప్రచార వ్యయాన్ని ఎప్పటికప్పుడు గ్రామస్థాయి అధికారులు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. లైజన్ ఆఫీసర్ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



మురారి చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

భానుడి భగభగలు



యర్రవరం వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

- మండిపోతున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

ఏలేశ్వరం: మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. గత రెండు రోజులుగా ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. శనివారం నియోజకవర్గంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల ముహూర్తాలు ఉండడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఎండల్లో విందు భోజనాలు ఆరగించి నానా హైరానా పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండలకు ప్రధాన రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. ఏలేశ్వరంలో నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం రోడ్డు, హనుమాన్ జంక్షన్, లింగంపర్తి రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. వాహనదారులు ఎండను తట్టుకొనేందుకు గొడుగులు, ముసుగులు ధరించారు. జాతీయరహదారిపై సైతం వాహనాల రాకపోకలు తగ్గాయి.



ఏలేశ్వరంలోని హనుమాన్ జంక్షన్‌లో జనం లేక వెలవెలబోతున్న దుకాణాలు



ఏలేశ్వరంలోని జనసంచారం లేని లింగంపర్తి రోడ్డు